క్లుప్తంగా

26న కార్యకర్తల సమావేశం

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 26న బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరుగుతుందని జెడ్పీటీసీ, పార్టీ మండల అధ్యక్షుడు మడతల కస్తూరిరెడ్డి తెలిపారు. సమావేశానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీలు, గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

సింగరాయకొండ: ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేసి చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్ నిధుల్లో కోత విధిస్తుందని ఆరోపించారు. మరోవైపు కేటాయించిన అరకొర నిధుల విడుదల్లోనూ నిర్లక్ష్యం వహిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాల చెల్లింపుకు ఆధార్‌కార్డు లింక్ చేయాలన్న నిబంధన తప్పనిసరి చేయడంతో 90 లక్షల మంది కూలీలను ఆ పథకం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

హనుమంతునిపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్సై మాధవరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం తాగి విచ్చలవిడిగా తిరిగి గొడవలకు దిగితే సహించేది లేదన్నారు. రోడ్లపై తిరుగుతూ గొడవలకు దిగినా, రాజకీయ పార్టీలతో గొడవలకు దిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళల్లో అక్షరాస్యత శాతం పెరగాలి

మద్దిపాడు: మహిళల్లో అక్షరాస్యత శాతం పెరగాలని ఏపీఎం ఎల్ కోటేశ్వరరావు అన్నారు. డీఆర్‌డీఏ వెలుగు, కేంద్రప్రభుత్వం సహకారంతో గ్రామాల్లో చదువురాని మహిళలకు చదువు చెప్పే ఉద్దేశంతో ఉల్లాస్ ప్రాజెక్ట్ ద్వారా మొదటి విడత గుండ్లసముద్రం, రేగలగడ్డ, సన్నమూరు, రావిళ్ల వారిపాలెం, గంగపాలెం, జువ్విగుంట, అయ్యప్పరాజుపాలెం గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత కోసం 876 మంది గ్రామసంఘాల మహిళలకు వలంటీర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, సీసీలు ఎజ్రా, కళ్యాణి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

టంగుటూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగ మల్లీశ్వరరావు అన్నారు. మండలంలోని కొణిజేడు, మర్లపాడు, కందులూరు, టంగుటూరు, అనంతవరం, అలకూరపాడు గ్రామాల పొలాల్లో ఆదివారం డ్రోన్ సహాయంతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. మందుబాబులు బహిరంగంగా పొలాల్లో మద్యం తాగిన తరువాత సీసాలు పగులగొడుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 11 మందిని అదుపులోనికి తీసుకొని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 14,19 వ వార్డుల్లో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.28లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వార్డుల్లో దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

చెరువులో నీరుతాగి నాలుగు గొర్రెలు మృతి

ఉలవపాడు: మండల పరిధిలోని వీరేపల్లి చెరువులో నీరు తాగి నాలుగు గొర్రెలు మృతి చెందినట్లు గొర్రెల యజమాని పొట్టేళ్ల సుబ్బారావు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరేపల్లి చెరువులో ఉలవపాడు చేపల సహకార సంఘం ఆధ్వర్యంలో చేపలు పెంచుతున్నారని, వీటి కోసం చెరువులో కోడిపెంట, యూరియా, పశువుల ఎరువు, రసాయనిక పదార్థాలు కలపడం వల్ల చెరువు నీరు కలుషితమవుతున్నాయని, ఆ నీరు గొర్రెలు తాగడం వల్ల మృతి చెందాయన్నారు. మొత్తం ఐదు గొర్రెలు ఈ నీరు తాగగా నాలుగు మృతి చెందగా మరొకటి అనారోగ్యంతో ఉందన్నారు. గొంతు కింద నీరు దిగి అనారోగ్యం పాలైనట్లు తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శనగ రైతు దిగాలు..!

- ముమ్మరంగా శనగ నూర్పిళ్లు
- తగ్గిన దిగుబడి, గిట్టుబాటు ధరలు
- పెట్టుబడి ఖర్చులు కూడా రాని వైనం
- మద్దతు ధర కల్పించాలని రైతుల వినతి



పొన్నలూరులో యంత్రంతో శనగ నూర్పిడి చేస్తున్న కూలీలు

పొన్నలూరు:

మండలంలో శనగ పంట నూర్పిళ్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది అరకొర వర్షాలతో దిగుబడి తగ్గి పంట ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు కనీసం పెట్టుబడులన్నా వస్తాయా లేవన్న ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయలు ఖర్చు చేసి పండించిన పంటకు అనుకూలమైనా గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు తప్పవని శనగ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం..

గత ఏడాది శనగ పంట మండలంలో అధిక దిగుబడులు వచ్చినా ఈ ఏడాది రైతులు గత ఏడాది కంటే తక్కువ ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. గత ఏడాది మండలంలో తెల్ల శనగలు 1000 ఎకరాలు, యర్ర శనగలు 2000 ఎకరాల్లో సాగు చేశారు. కానీ ఈ ఏడాది తెల్ల శనగలు 800 ఎకరాలు, యర్ర శనగలు 1200 ఎకరాల్లో సాగు చేశారు. ముఖ్యంగా మండలంలోని చెన్నిపాడు, కోటపాడు, రావులకొల్లు, జెడ్ మేకపాడు, ఉప్పలదిన్నె, తిమ్మపాలెం, పొన్నలూరు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో అధికంగా శనగ పైరును సాగు చేశారు. గత ఏడాది నవంబర్ నెలలో కురిసి అడపాదడపా వర్షానికి మొదటి విడతలో సాగు చేసిన శనగ పంట ఒక రకంగా దిగుబడి రాగా ఆ తరువాత ఒక నెల వ్యవధిలో రెండవ విడతగా డిసెంబర్‌లో సాగు చేసిన శనగ పంటకు సక్రమంగా నీటి తడులు అందకపోవడంతో చాలా వరకు దిగుబడులు తగ్గాయని రైతులు అంటున్నారు.

దిగుబడి అంతంతమాత్రమే..

గత ఏడాది ఎకరాకు 8 నుంచి 10 క్వింటాల దిగుబడి వచ్చింది. అయితే ఈ ఏడాది మొదటి విడతలో సాగు చేసిన శనగ పైరు ఎకరాకు సుమారుగా 6 నుంచి 8 క్వింటాళ్ల లోపు దిగుబడి వస్తుందని, అలాగే రెండవ విడత సాగు చేసిన శనగ పైరు ఎకరాకు 4 నుంచి 6 క్వింటాల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఈ ఏడాది చాలా వరకు వర్షాభావ ప్రభావంతో డిసెంబర్‌లో శనగ పంటను సాగుచేసిన 40 శాతం మంది రైతులకు పంట దిగుబడులు సరిగా రాక నష్టం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

పెరిగిన పెట్టుబడి..

గత ఏడాది కంటే ఈ ఏడాది శనగ పంట దిగుబడులతో పాటు గిట్టుబాటు ధరలు తగ్గాయని రైతులు అంటున్నారు. గత ఏడాది తెల్ల శనగలు క్వింటా రూ.8 వేలు నుంచి రూ.10 వేలు, యర్ర శనగలు రూ, 4 వేలు నుంచి 6 వేల వరకు ఉన్నాయి. ఈ ఏడాది తెల్ల శనగలు రూ.6 వేల నుంచి రూ.8 వేలు, ఎర్ర శనగలు రూ.5 వేల వరకు ఉన్నాయి. ఇది ఇలా ఉంటే ఈ ఏడాది శనగ పంటకు పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగాయి. ఎకరా భూమి కౌలు రూ.25 వేలు, ట్రాక్టర్ సేద్యం రూ.10 వేలు, విత్తనాల కొనుగోలు రూ.8 వేలు, కలుపు కూలీలు రూ.4 వేలు, కోతకూలీ, నూర్పిడి యంత్రం బాడుగకు రూ.8 వేలు ఇలా ఎకరాకు మొత్తం ఖర్చు రూ.50 వేల నుంచి రూ.55 వేలు వరకు అయ్యింది. శనగ పంటకు గిట్టుబాటు ధర కొంచం అటు ఇటుగా ఉన్నా దిగుబడులు అనుకున్న స్థాయిలో రాకపోవడంతో కొంత మేర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. వర్షాభావ ప్రభావంతో సక్రమంగా పండని శనగ పంటకు పెట్టుబడుల ఖర్చులను దృష్టిలో పెట్టుకొని మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కౌలు రైతులకు నష్టమే:



ఈ ఏడాది కౌలుకు తీసుకొని శనగ పైరు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. కౌలు రైతుకు ఎకరాకు సుమారుగా రూ.55 వేలు ఖర్చు అవుతుంది. పంట చివరి వరకు లక్షల రూపాయిలు పెట్టుబడి ఖర్చులు పెట్టారు. ప్రస్తుతం పంట దిగుబడి ఎకరాకు 4 నుంచి 6 క్వింటాలు మాత్రమే వస్తుంది. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

వరికూటి బ్రహ్మారెడ్డి, రైతు, సుంకిరెడ్డిపాలెం

మద్దతు ధర కల్పించాలి:



వర్షాభావ ప్రభావంతో శనగ పంటకు పూత దశలో నీటి తడులు అందక పోవడంతో అనుకున్న విధంగా దిగుబడి రాలేదు. దీంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో క్వింటాకు రూ,.8 నుంచి రూ.10 వేల వరకు ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి గత ఏడాది కంటే మెరుగ్గా శనగ పంటకు మద్దతు ధర కల్పించాలి.

దావులూరి మాల్యాద్రి, రైతు, విప్పగుంట

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



కనిగిరిలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

కందుకూరు: భగత్‌సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఘన నివాళి అర్పించారు. సీపీఐ నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు మాట్లాడుతూ భారతమాత బానిస సంకెల్లు తెంచాలనే లక్ష్యంతో ఆంగ్లేయులను ఎదిరించిన ధీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్ నేటి యువతరానికి ఆదర్శమని, ఆయన స్ఫూర్తితో పేదల సమస్యలు పరిష్కరించేందుకు యువకులు ఉద్యమబాట పట్టాలని పిలుపునిచ్చారు. జాషువా సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు ముప్పవరపు కిశోర్, ఏఐటీయూసీ కార్యదర్శి ఎర్రంశెట్టి ఆనందమోహన్, ఏఐవైఎఫ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి మాధవరావు, సీపీఐ నియోజకవర్గ సభ్యులు బొల్లోజుల బాలబ్రహ్మాచారి, బ్రహ్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు పోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, సన్నపురెడ్డి తిరుపతి రెడ్డి అన్నారు. స్థానిక నారాయణస్వామి కాంప్లెక్స్‌లో ఆదివారం సీపీఎం, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్.వెంకటరామయ్య, గుర్రం లక్ష్మయ్య, పొదిలి నరసింహులు, ఎస్.పెద్దయ్య, కార్మికసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పామూరు: యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ కనిగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కందుకూరు రోడ్డులో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలపర్తి మస్తాన్‌రావు, పేరం రఘునాథరెడ్డి, రాగిపాటి సూరిబాబు, రఫీ, ప్రసాద్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీయం నాయకులు

కనిగిరిరూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన గొప్ప పోరాటయోధుడు భగత్‌సింగ్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ యాసీన్ అన్నారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో ఆదివారం భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. సీపీఐ, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్, ఏఐటీయూసి, రైతు సంఘం నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఎస్కే ఖాశింపీరా, పుట్టా సుబ్బారావు, పూర్ణచంద్రరాజు, నజీముద్దీన్, సీహెచ్ పవన్ కళ్యాణ్, గూడూరి సురేష్, సయ్యద్ ఇర్ఫాజ్ పాల్గొన్నారు. అదే విధంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.పాండు రంగారావు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి పి.నరేంద్ర, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, జేవీవీ మండల కార్యదర్శి జి. శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తు నేతలు

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు: ఐపీఎల్ నేపథ్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రమణ్యం హెచ్చరించారు. కందుకూరు డివిజన్ పరిధిలో ట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గుంపులు, గుంపులుగా కూర్చుకుని సెల్ చూస్తూ బెట్టింగ్‌లు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడడమే కాకుండా, డబ్బులు పోగొట్టుకుని దిక్కుతోచని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. చుట్టుపక్కల ఇళ్లలో గానీ, షాపుల్లో గానీ క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. క్రికెట్ బెట్టింగ్‌ల గురించి సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, అలాగే డయల్ 100, 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చునని సూచించారు.

అంజుమన్ కమిటీ అధ్యక్షునిగా ఎస్కే అహ్మద్



ఎస్కే అహమ్మద్ బాషా

కనిగిరిరూరల్: అంజుమన్ కమిటీ అధ్యక్షునిగా పట్టణంలోని 19వ వార్డుకు చెందిన ఎస్కే అహమ్మద్ హుస్సేన్ బాషా నియమితులయ్యారు. స్థానిక షాదీఖానాలో ఆదివారం నూతన అధ్యక్షుని ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, తాజా మాజీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్కే ఖాశింసాహెబ్, ఉపాధ్యక్షుడు పీర్ల మస్తాన్‌వలి, మాజీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్కే లతీఫ్, రోషన్ సందాని, సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ యాసీన్, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ నూతన అధ్యక్షుడు ఎస్కే అహమ్మద్ బాషాను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మకు పొంగళ్లు



అమ్మవారి పూజల్లో పాల్గొన్న ధర్మకర్త లింగయ్యనాయుడు, అధికారులు



పొంగళ్లు సమర్పించేందుకు బారులు తీరిన మహిళలు

కందుకూరు: కందుకూరు గ్రామదేవత, ఆదిపరాశక్తి అంకమ్మతల్లి పాల పొంగళ్ల వేడుక తిరునాళ్ల వాతావరణంలో ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం ఐదు గంటల నుంచే అమ్మవారికి పొంగళ్లు సమర్పించేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేడుక సంప్రదాయంలో భాగంగా ఐదు గంటలకు పిన్నంరాజు కుటుంబ సభ్యులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి వేడుకను ప్రారంభించారు. అనంతరం పట్టణ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు బారులు తీరి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికను సంతరించుకుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ పి.కార్తీక్, గ్రామదేవతల వారసత్వ ధర్మకర్త దివి లింగయ్యనాయుడు, మాదాల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు

కందుకూరు: పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ సమస్య నివారణకు పామూరు రోడ్డు సర్కిల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి మహదేవపురం రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్‌లను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కోట్లాది రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన ఎంజీబీ లేఅవుట్‌లో మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే రేట్లు అధికంగా ఉన్నాయని, ఎంజీబీ లేఅవుట్‌లో ప్లాట్ల రేట్లు తగ్గించాలని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను కోరినట్లు తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: మహిళల చట్టాలపై ముఖ్యంగా పోక్సో చట్టం, బాల కార్మిక చట్టాలపై, లైంగికదాడి వంటి చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పాకలలో ఆదివారం పోక్సో చట్టంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భారతి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలంటే చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే దాడులను సమర్థవంతంగా ఎదుర్కొవచ్చన్నారు. ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎస్ హేమలత, కందుకూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ నిఖిల్‌రెడ్డి, మార్కాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం బాలాజీ, సీఐ సీహెచ్ హజరత్తయ్య, తహశీల్దార్ టి.రవి, న్యాయవాదులు బక్కముంతల వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి



డీఎస్పీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కనిగిరిరూరల్: క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. పట్టణంలోని బోధి ధర్మ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఆరో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కరస్పాండెంట్ జి.రవీంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్య సాధన దిశగా అడుగులు వేసినప్పుడే బంగారు భవిష్యత్ లభిస్తోందన్నారు. ఎంఈఓ యువీ నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమన్నారు. మోటివేషనల్ స్పీకర్ శ్రీ పాదం మాట్లాడుతూ క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన చదువును అలవర్చుకోవాలన్నారు. వివిధ పోటీల్లోని విజేతలకు ప్రిన్సిపాల్ టి.జ్యోతి చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం డీఎస్పీ, ఎంఈఓ, మోటివేషనల్ స్పీకర్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ, మహానివేదన



గోపూజలో పాల్గొన్న ఈఓ, భక్తులు



భక్తులు మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ, అభిషేక కార్యక్రమం ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవ మూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కందుల కొనుగోళ్లు



సిబ్బందితో మాట్లాడుతున్న ఏఓ విజయ్‌కుమార్

కొండపి: కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ తెలిపారు. కంది, శనగ కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేస్తున్నామని, కందులకు క్వింటా రూ.7550, శనగ క్వింటాకు రూ.5650 కనీస మద్దతు ధర ఉంటుందని తెలిపారు. కంది, శనగ పండించిన రైతులు దగ్గరలోని రైతు సేవ కేంద్రాలలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ద్వారా వివరాలను సీఎంఏపీపీలో నమోదు చేసుకోవాలని సూచించారు. కందులను పెట్లూరులో ఉన్న రామాలయం వీధిలోని రామచంద్రరావు గోడౌన్‌లో కొనుగోలుచేస్తామన్నారు. శనగ సాగు చేసిన నమోదు చేసుకున్న రైతుల కోసం కూడా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలో కంది, శనగ పండించిన రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

పామూరు: స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ, పరిష్కారం వేగవంతం చేయాలని కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించిన డీఎస్పీ రికార్డుల నిర్వహణ మెరుగుపరుచుకోవాలని సూచించారు. శనివారం జరిగిన చోరీలపై డీఎస్పీని ప్రశ్నించగా.. చోరీ కేసును త్వరితగతిన చేదిస్తామని ఆదిశగా అన్ని కోణాల్లో సాక్ష్యాలు సేకరించడం, విచారణ సాగుతోందన్నారు. చోరీల దృష్ట్యా రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని, పగలుకూడా నూతన వ్యక్తులపై దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఉలవపాడులో బాలస్వామీజీ పాదయాత్ర



వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద బాలస్వామిజీ

ఉలవపాడు: హిందూ ధర్మ పరిరక్షణకు పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి తెనాలి నుంచి తిరుమలకు చేపట్టిన మహాపాదయాత్ర ఆదివారం ఉలవపాడు చేరుకుంది. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, వ్యాపారస్తులు తమ వ్యాపారాలతో కళకళ లాడాలని ఈ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఉలవపాడుకు చేరిన ఈ యాత్రకు ఉలవపాడు మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు స్వాగతం పలికారు. మంగళవాయిద్యాలు, గోవింద నామాలతో, జైవాసవీ నినాదాలతో ఆయన వెంట పాదయాత్రలో పాల్గొన్నారు. ఉలవపాడులో నూతనంగా నిర్మించనున్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ స్థలాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం, శివకుమార్, సత్యనారాయణ, అయ్యప్ప, శ్రీనివాసులు, గంగాధర్, శ్రీనివాసులు, హనుమంతరావు, మహేష్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత శ్రీరాంపురం



హోరాహోరీగా సాగుతున్న ఫైనల్ మ్యాచ్

ఉలవపాడు: రామాయపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 27 గ్రామాల వాలీబాల్ పోటీల్లో శ్రీరామపురం జట్టు ప్రథమ బహుమతి రూ.15 వేలు గెలుచుకుంది. రెండో బహుమతిగా చాకిచర్ల చినపట్టపుపాలెం జట్టు రూ.12,000, మూడో బహుమతి బట్టి సోమయ్యపాలెం జట్టు రూ.8 వేలు, నాల్గవ బహుమతి క్రాంతినగర్ జట్టు రూ.5 వేలు సాధించారు. రామాయపట్నం మెరైన్ సీఐశివన్నారాయణ వీరికి బహుమతులు అందచేశారు. మొత్తం 16 టీంలు పోటీల్లో పాల్గొన్నారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా బట్టి సోమయ్యపాలెంకు చెందిన రాజు గెలుచుకున్నాడు. కార్యక్రమంలో మెరైన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మత్స్యకార గ్రామాల సర్పంచ్‌లు, కాపులు అవనిగడ్డ నాగయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణారావు, ఆవుల వెంకటరమణ, తూపిలి రవి, వాయిల తిరుపతి, జెసి వెంకటేశ్వర్లు, ఆవుల పోలయ్య,జెట్టి నరేంద్రలు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

సింగరాయకొండ: జీవీఆర్ సంస్థల అధినేత గ్రంధి వెంకటేశ్వరరావు 85వ జయంతి సందర్భంగా ఈనెల 24న సోమవారం కంపెనీలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు కంపెనీ మేనేజర్ శ్రీనివాసరావు, బాబూరావు తెలిపారు.